

'ఇంటర్'లో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

గుజరాతీపేట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సీతంపేటలోని ప్రతిభా కళాశాలలో ఇంటర్‌లో చేరేందుకు గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. 'శ్రీకాకుళం, పార్వతీపురం, మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పుగోదావరి, కాకినాడ, పశ్చిమగోదావరి, డాక్టర్ అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన గిరిజన విద్యార్థులు మార్చి 2వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మార్చి 9న సీతంపేట ఏపీటీడబ్ల్యూఆర్ (బాలికల)లో ప్రవేశపరీక్ష నిర్వహించనున్నామ'ని ఐటీడీఏ వెల్లడించింది.

ఇక్కడ ఓ కొండ ఉండేది!

ఒకప్పుడు పచ్చనిచెట్లు, ఎర్రని మట్టి దిబ్బలతో ఆహ్లాదంగా ఉండే ఆ కొండ కనుమరుగైపోతోంది. కొంతమంది వ్యక్తుల ధనదాహం కారణంగా దాని స్వరూపమే కోల్పోయింది. అనుమతుల్లేకుండా లేకుండా కంకర కోసం తవ్వకాలు చేపట్టి.. ఏకంగా దాన్ని గుల్ల చేసేశారు. రెండు నెలలుగా వందలాది లారీలు, ట్రాక్టర్లలో కంకరను తరలిస్తున్నారు. కొందరు వైసీపీ స్థానిక నాయకులంతా ఏకమై లక్షలాది రూపాయలు జేబులో వేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- కంకర అక్రమంగా తవ్వుకుని.. అమ్మేసుకుని..
- లారీలు, ట్రాక్టర్లలో వందలాది లోడ్లు రవాణా
- స్వరూపమే కోల్పోయిన ముక్తింపురం కొండ
- కొందరు వైసీపీ స్థానిక నేతల ధన దాహమిది
- అయినా పట్టించుకోని అధికారులు



కంకర తవ్వకాలతో చదునుగా మారిన ముక్తింపురం కొండ

రణస్థలం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి):

రణస్థలం మండలం ముక్తింపురం కొండపై కంకర(గ్రావెల్) తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ముక్తింపురంలో 58 సర్వే నంబర్‌లో 76 ఎకరాల్లో కొండ పోరంబోకు భూమి ఉంది. వన నర్సరీలో భాగంగా అప్పటికే ఆ భూమిలో అటవీశాఖ నీలగిరి, ఆకేసు చెట్లు పెంచుతోంది. గనుల శాఖ, పంచాయతీ అనుమతులు సైతం తీసుకోవాలి. కానీ కనీస అనుమతులు లేకుండా వందలాది లారీలు, ట్రాక్టర్లలో ఈ కొండపై కంకరను తరలించుకుపోయారు. వేలాది క్యూబిక్ మీటర్లలో తవ్వకాలు చేసినట్టు అక్కడి ఆనవాళ్లు తెలియజేస్తున్నాయి. రాత్రిపూట భారీ యంత్రాలతో తవ్వకాలు చేపట్టడం.. లారీలు, ట్రాక్టర్లలో తరలించడం విశేషం. ఇంత జరుగుతున్నా సచివాలయ సిబ్బంది కానీ.. రెవెన్యూ అధికారులు కానీ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. దీని వెనుక పెద్ద ముఠా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

అప్పట్లో భారీ ఆక్రమణ..

గతంలో ఈ కొండను అప్పటి వైసీపీ నేతలు ఆక్రమించేందుకు పన్నిన పన్నాగం వివాదంగా మారింది. ఇక్కడ ఎకరా రూ.3 కోట్లపైగా పలుకుతోంది. ఈ భూమి పక్కనే ప్రైవేట్ లేఅవుట్‌లు వెలిశాయి. ఇక్కడ సెంటు భూమి ధర రూ.5లక్షలు. మూడున్నర సెంట్ల ఇంటి ప్లాట్ రూ.15లక్షలకు విక్రయిస్తున్నారు. దీంతో కొండ పోరంబోకు భూమిపై కొంతమంది వ్యక్తుల కన్నుపడింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొండ దిగువ ప్రాంతంలో 15 ఎకరాలు చదును చేసి ప్లాట్లుగా విభజించారు. గ్రామంలో నిరుపేదల పేరిట ప్లాట్లను విభజించారు. ప్రభుత్వం నుంచి కానీ, అధికారుల నుంచి కానీ ఎటువంటి అనుమతులు తీసుకోలేదు. మొత్తం 200 మందికిపైగా ప్లాట్లు కట్టబెట్టారు. అప్పట్లో ప్రభుత్వం మంజూరు చేసినట్టు ప్రచారం చేసుకున్నారు. కానీ తెర వెనుక మొత్తం భూమిని (మిగతా 6వ పేజీలో..)

- చర్యలు తీసుకుంటాం

ముక్తింపురం కొండపై కంకర తవ్వకాలు జరుగుతున్నట్టు ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై సిబ్బందిని అప్రమత్తం చేశాం. పూర్తిస్థాయిలో పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

-ఎస్.ప్రసాద్, తహసీల్దారు, రణస్థలం



పాండవుల మెట్టకు ఆధ్యాత్మిక శోభ 6లో


- ఏకాదశి వేడుకలకు సిద్ధం



ప్రాక్టికల్స్ గట్టెక్కేదెలా?

- జూనియర్ కళాశాలల్లో కానరాని ల్యాబ్‌లు
- కొన్నిచోట్ల ఉన్నా సౌకర్యాలు లేవు
- ప్రయోగాలు చేసేందుకు విద్యార్థులకు ఇబ్బందులు
- తరగతుల నిర్వహణపై కూడా నిర్లక్ష్యమే

6లో



రేగులపాడు గ్రామం వద్ద నిలిచిన ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు

'ఆఫ్‌షోర్'పై కదలిక

- నేటి నుంచి పనులు పునఃప్రారంభం
- కాంట్రాక్టర్‌కు రూ.19కోట్ల బకాయి చెల్లించిన కూటమి ప్రభుత్వం

పలాస, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పలాస మండలం రేగులపాడు గ్రామం వద్ద ఆగిపోయిన ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణంలో కదలిక వచ్చింది. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌ను పూర్తిచేస్తామని కూటమి నేతలు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఈ మేరకు ఇటీవల కూటమి ప్రభుత్వం ఆఫ్‌షోర్ పనులకు గానూ రూ.35కోట్లు విడుదల చేస్తున్నట్టు ప్రకటించింది. గత ప్రభుత్వం బకాయి ఉన్న రూ.19కోట్లను కాంట్రాక్టర్ ఖాతాకు జమ చేసింది. ఈ నేపథ్యంలో శనివారం నుంచి పనులు పునఃప్రారంభించేందుకు కాంట్రాక్టర్ సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా.. ఇవి పాత పనులే కావడంతో ఆటంకం లేకుండా పునఃప్రారంభించనున్నారు.

- దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో జలయజ్ఞం కార్యక్రమంలో భాగంగా 2008లో పలాస మండలం రేగులపాడు గ్రామం వద్ద మహేంద్రతనయ-ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌కు శంకుస్థాపన చేశారు. రూ.147కోట్ల వ్యయంతో దీన్ని (మిగతా 6వ పేజీలో..)

గోనెసంచులు ముసుగేసుకుని..

- 30 కేజీలు వెండి, 20గ్రాముల బంగారు నగల చోరీ
- రూ.20వేల నగదు కూడా అపహరణ

నరసన్నపేట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట మండలం ఉర్లాంలోని బంగారం షాపులో గురువారం రాత్రి చోరీ జరిగింది. ముసుగు దొంగలు ఈ షాపు తాళాలు పగులగొట్టి.. వెండి, బంగారు ఆభరణాలు, నగదు అపహరించారు. పోలీసుల వివరాల మేరకు.. ఉర్లాంలోని కలిశెట్టి అప్పలనాయుడుకు చెందిన అయ్యప్ప బంగారం దుకాణంలో గురువారం రాత్రి ఐదుగురు వ్యక్తులు గోనెసంచులు ముసుగు ధరించి చోరీకి పాల్పడ్డారు. తాళాలు పగులగొట్టి.. షట్టర్లు తెరిచి షాపులోకి ప్రవేశించారు. షాపులో ఉన్న సుమారు 30 కిలోల వెండి ఆభరణాలు, 20 గ్రాముల బంగారం ఆభరణాలతోపాటు రూ.20వేల నగదు దొంగిలించారు. శుక్రవారం ఉదయం షాపు తెరిచేందుకు వచ్చిన అప్పలనాయుడు ఈ విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ జె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్ఐ దుర్గాప్రసాద్, పోలీసులు అక్కడకు చేరుకుని దుకాణాన్ని, సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. గోనెసంచులు ముసుగు ధరించి ఐదుగురు వ్యక్తులు ఈ చోరీలో పాల్గొన్నట్టు గుర్తించామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. షాపులోని లాకర్‌లో బంగారం ఆభరణాలు భద్రపరచడంతో.. వాటిని తెరిచేందుకు దొంగలు తీవ్ర ప్రయత్నం చేశారన్నారు. అవి తెరచుకోకపోవడంతో భారీస్థాయిలో దొంగతనం తప్పిందని తెలిపారు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నామన్నారు. అలాగే శ్రీకాకుళం నుంచి వచ్చిన క్లూస్‌టీమ్ సభ్యులు కూడా షాపులో వేలిముద్రలను సేకరించారు. పాత నేరస్తులే ఈ చోరీ పాల్పడినట్టు పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. ఉర్లాం జంక్షన్‌లోని వివిధ షాపులకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. దొంగలు ద్విచక్రవాహనాలపై వచ్చారా? లేదా ఏదైనా ఫోర్ వీల్ వాహనంపై వచ్చారా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు.



షాపు యాజమాని నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్



ఘనంగా మహాలక్ష్మి కల్యాణం 6లో



శ్వేతగిరి యాత్రకు సర్వం సిద్ధం 6లో

సెలవు రోజుల్లోనూ.. మధ్యాహ్న భోజనం

- పదో తరగతి విద్యార్థుల్లో ఆనందం



హిరమండలంలో పదోతరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన మధ్యాహ్నభోజనం (ఫైల్)

హిరమండలం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్‌కు ఎంతో కీలకమైన పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తోంది. పరీక్షల గడువు సమీపిస్తుండడంతో అదనపు తరగతులతోపాటు సెలవు రోజుల్లో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. తాజాగా పదోతరగతి విద్యార్థులకు సెలవు రోజుల్లోనూ మధ్యాహ్న భోజనం అమలుకు శ్రీకారం చుట్టింది. ఈ నెల 2 నుంచి ఈ విధానం అమలు చేస్తోంది. మార్చి 10 వరకూ దీనిని కొనసాగించనుంది. దీంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- జిల్లాలోని 414 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 21,834 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. మార్చి 17 నుంచి వార్షిక ప్రణాళికలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థులను పరీక్షలను సన్నద్ధం చేసేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతినెలా రెండో శనివారం, ప్రతీ ఆదివారంతోపాటు ఇతర సెలవు రోజుల్లోనూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకూ, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రత్యేక బోధన కొనసాగిస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే కొంత మంది విద్యార్థులు క్యారేజీలు తెచ్చుకోలేకపోవడంతో మధ్యాహ్న భోజనానికి ఇబ్బందులు పడేవారు. దీంతో కొంతమంది సక్రమంగా ప్రత్యేక తరగతులకు హాజరుకావడం లేదు. కాగా.. కూటమి ప్రభుత్వం తాజాగా సెలవు రోజుల్లోనూ మధ్యాహ్న భోజనం అమలు చేస్తుండడంతో తమకు ఆకలి బాధలు తప్పాయని పలువురు విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అవలంగి ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి ప్రణాళిక ప్రకారంగా బోధన చేస్తున్నారు. సెలవు రోజుల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు వల్ల పూర్తి సమయం చదువుకు కేటాయించవచ్చు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మంచి మార్కులు సాధించాలి.

-ఎస్.తిరుమల చైతన్య, జిల్లా విద్యాశాఖ అధికారి

చదవాలంటే.. 3కి.మీ. నడవాల్సిందే

- దాసుపురం నిర్వాసిత కాలనీలో పాఠశాల లేక ఇబ్బందులు



పాఠశాలకు నడిచి వెళ్తున్న దాసుపురం నిర్వాసిత కాలనీ విద్యార్థులు

మెళియాపుట్టి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి మండలం దాసు పురం నిర్వాసిత కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ ఈ గ్రామం నుంచి 14 మంది విద్యార్థులు మూడు కిలోమీటర్లు నడుస్తూ.. పాతదాసుపురంలోని పాఠశాలకు వెళ్తున్నారు. ఏడేళ్ల నుంచీ ఇబ్బందులు పడుతున్నా.. అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌లో భాగంగా మెళియాపుట్టి మండలంలో దాసుపురం, చీపురుపల్లిని నిర్వాసిత గ్రామాలుగా గుర్తించారు. ప్రభుత్వం నష్ట పరిహారం మంజూరు చేయడంతో ఈ గ్రామాలను అధికారులు ఖాళీ చేయించారు. దాసుపురానికి చెందిన నిర్వాసితులకు.. గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో స్థలాలు కేటాయించారు. ఏడేళ్ల కిందటే నిర్వాసిత కాలనీల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. పాత గ్రామంలో ఇళ్లు కూలిపోవడంతో.. 80శాతం మంది నిర్వాసిత కాలనీకి వెళ్లిపోయారు. కాగా నిర్వాసిత కాలనీలో పాఠశాల నిర్మాణానికి నిధులు మంజూరు కాకపోవడం పనులు మధ్యలో నిలిపేశారు. గత వైసీపీ ప్రభుత్వం 'నాడు-నేడు'లో భాగంగా పాఠశాల అభివృద్ధికి చర్యలు చేపట్టినా.. ఈ పాఠశాలకు మాత్రం నిధులు మంజూరు చేయ లేదు. దీంతో దాసుపురం నిర్వాసిత కాలనీ విద్యార్థులకు పాతదాసుపురంలో ఉన్న పాఠశాలే దిక్కవుతోంది. పాఠశాలకు వెళ్లాలంటే రోజూ పొలాలు, వాగులు దాటుకుని సుమా రు మూడు కిలోమీటర్లు నడవాల్సి వస్తోందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ రోజు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. సర్పంచ్ ఈశ్వరరావు పలుమార్లు ఈ సమస్యను విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



శ్వేతగిరి యాత్రకు సర్వం సిద్ధం

● విద్యుత్ కాంతులతో కొత్త శోభ



క్యూలైన్‌లో దర్శనానికి వెళుతున్న భక్తులు

గార, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): శాలిహుండం కొండపై వెలసిన వేణుగోపాల స్వామి ఉత్సవాలకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. ఏటా భీష్మ ఏకాదశి సందర్భంగా ఈ ఆలయంలో ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో శనివారం నిర్వహించే యాత్రకు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తుల దర్శనానికి వీలుగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయం, పరిసరాలను, కొండపైకి వెళ్లే మెట్ల మార్గాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

250 మందితో బందోబస్తు..


శాలిహుండం కొండపై శనివారం జరగనున్న యాత్రలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 250 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు సీఐ పైడపునాయుడు, గార ఎస్.ఐ. జనార్దన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం గారలో బందోబస్తుకు వచ్చే పోలీసులకు సూచనలు చేశారు. కొండపైన భక్తులు స్వామి వారి దర్శనానికి ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. చక్రతీర్థ స్నానాల సందర్భంగా కొండ దిగువన భక్తులు ఇబ్బందులు పడకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్టు సీఐ తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.



వేణుగోపాల స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు




సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీఐ పైడపునాయుడు



పాండవుల మెట్టకు ఆధ్యాత్మిక శోభ

● ఏకాదశి వేడుకలకు సిద్ధం



ద్రౌపది నివసించిన గుహ

టెక్కలి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తూర్పు కనుమలలోని సుమంచ పర్వతంగా పేరొందిన పాండవుల మెట్ట ఆధ్యాత్మిక క్షేత్రంగా వెలుగొందుతోంది. ఏటా భీష్మ ఏకాదశి సందర్భంగా పెద్ద ఎత్తున ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. వనవాస కాలంలో సీతా సమేత శ్రీరామచంద్రుడు, సుసేనుడు, అనంతర కాలంలో పాండవులు, రుషులు, అవధూతలు, దిగంబరులు, యోగులు నివశించిన సుమంచ పర్వతమే పాండవుల మెట్టగా పేరొందింది. నేపాల్ దేశ రాజ వంశీకులు బాలకృష్ణానంద గిరిబాబా ఎనిమిది దశాబ్దాల కిందట భారతదేశ పర్యటనలో భాగంగా ఈ ప్రాంతానికి విచ్చేసి యోగా కుటీరాన్ని స్థాపించినట్టు చెబుతారు. ఇక్కడ జ్ఞాన యజ్ఞం, తపోయజ్ఞం, నామ యజ్ఞం, భూతయజ్ఞం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశి పూజలు జరిగేవి. 1983 ఏప్రిల్ 24న ఆయన మహాసమాధి పొందారు. వారి దత్తపుత్రుడు స్వామి నిరంజనానంద గిరి ఆధ్వర్యంలో నేటికీ భీష్మ ఏకాదశి వేడుకలు కన్నుల పండువగా నిర్వహిస్తుంటారు. వేలాదిమంది భక్తులు ఏకాదశి రోజున పాండవుల మెట్టను దర్శించుకుంటారు. ఈ పాండవుల మెట్ట అనేక వనమూలికలకు ప్రసిద్ధి. దీంతో అనేక మంది అక్కడికి వెళ్లి... వన మూలికలు సేకరిస్తుంటారు. పాండవులు నివశించినట్లు చెప్పడానికి నిదర్శనంగా ఇక్కడి గుహలను చూపుతారు ఏకాదశిని పురస్కరించుకొని పాండవుల మెట్టపై లలితాదేవి అభిషేక పూజలు, వేదాంత గోష్టి తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ఇక్కడ ఓ కొండ ఉండేది!

(ఐదో పేజీ తరువాయి)

ఆక్రమించుకోవాలని అప్పటి చోటా నేతలు ఆలోచన చేశారు. దీంతో అది రెండు సామాజికవర్గాల మధ్య వివాదంగా మారిపోయింది. గతేడాది ఫిబ్రవరి 4న ఘర్షణకు దారి తీయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అధికారులు వచ్చి హెచ్చరిక బోర్డులు పాతడంతో వివాదం సద్దుమణిగింది. అయితే ఇప్పుడు తాజాగా అదే కొండను గుల్ల చేసి వందలాది లోడ్ల కంకర తవ్వకాలు చేపట్టడం ఆందోళన కలిగిస్తోంది. దీనిపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు..

ఈ ప్రాంతంలో కంకరకు విపరీతమైన డిమాండ్ ఉంది. పరిశ్రమలు, గృహ నిర్మాణాలకుగాను భారీగా గిరాకీ ఉంది. దీంతో అక్రమార్కులు అనుమతులు ఉన్నాయని చెబుతూ ఈ కొండపై వేల క్యూబిక్ మీటర్లలో తవ్వకాలు చేసి కంకరను తరలిస్తున్నారు. ఇప్పటికే కొండ చుట్టుపక్కల గుల్ల చేశారు. ఒక్కో లారీ లోడు (6 యూనిట్లు) రూ.7,200కు విక్రయిస్తున్నారు. అలాగే ట్రాక్టర్ లోడు రవాణా దూరం బట్టి రూ.600 నుంచి రూ.వెయ్యి వరకూ వసూలు చేస్తున్నారు. ఈ విషయాన్ని సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించకపోతే కొండ కనుమరుగు కావడం ఖాయమని పేర్కొంటున్నారు. జిల్లా అధికారులు స్పందించి కంకర అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

'ఆఫ్‌షోర్'పై కదలిక

(ఐదో పేజీ తరువాయి)

నిర్మించతలపెట్టగా పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఆ అంచనా రూ.900 కోట్లకు పెరిగింది. అంతమొత్తంలో నిధులు వెచ్చించలేక వచ్చిన అన్నీ ప్రభుత్వాలు దీనిపై ఎన్నికల్లో ఓట్ల కోసం వినియోగించుకున్నాయి తప్ప.. పనులు పూర్తి చేయలేకపోయాయి. గతంలో టీడీపీ ప్రభుత్వం 'ఆఫ్‌షోర్' కోసం దపదఫాలుగా నిధులు కేటాయించి 40 శాతం వరకూ పనులు నిర్వహించింది. గత వైసీపీ ప్రభుత్వం ఈ పనుల ఊసేలేదు. ఈసారి తాము అధికారంలోకి వస్తే.. ఈ ప్రాజెక్టును పూర్తిచేస్తామని మొన్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఈ మేరకు ప్రస్తుతం దీన్ని ఏ విధంగానైనా పూర్తిచేయాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం రూ.35కోట్లు మొదటి విడతగా విడుదల చేసింది. కాలువ, సర్‌ప్లస్‌వియర్, స్లూయస్, గట్టు ఎత్తుపెంచడం, రిజర్వాయరులో మట్టిని తీసి చదును చేయడం, ఆల్‌ఆంధ్రా రహదారి పూర్తిస్థాయిలో నిర్మించడం వంటి పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రతిపాదనలు పూర్తయ్యాయి. దీంతోపాటు ముంపు గ్రామాల ప్రజలను తరలించడంతో పాటు వారికి పునరావాస ప్యాకేజీ పూర్తిస్థాయిలో అందించాల్సి ఉంది. మొత్తం ప్రక్రియ పూర్తయితే ఆఫ్‌షోర్ రిజర్వాయరుకు ఉన్న అడ్డంకులన్నీ తొలగిపో యినట్లే. పలాస, టెక్కలిపట్నం వద్ద పునరావస గృహాలు ఇప్పటికే శతశాతం పూర్తయ్యాయి. రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే పలాస, వజ్రపుకొత్తూరు, మెళియాపుట్టి, నందిగాం, టెక్కలి మండలాలకు చెందిన మొత్తం 25వేల ఎకరాల ఆయకట్టుకు పూర్తిగా సాగునీరు, పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీకి తాగునీరు అం దించడానికి అవకాశం ఉంది. దీనిపై రైతులతో పాటు స్థానికులు ఆశతో ఉన్నారు.

మాది చేతల ప్రభుత్వం..



మాది చేతల ప్రభుత్వం. ఆఫ్‌షోర్ రిజర్వాయర్.. ఈ ప్రాంత ప్రజల ఆకాంక్ష. నిధులున్నా గత వైసీపీ ప్రభుత్వం దీనిని పూర్తిచేయకుండా వదిలేసింది. స్థానికంగా ఉన్న మాజీ మంత్రి కూడా దీనిపై దృష్టి పెట్టకపోవడంతో పనులు నిలిచిపోయాయి. నేను ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంటనే రిజర్వాయర్ వ్యవహారాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాను. ఆయన సానుకూలంగా స్పందించి రూ.35కోట్లు ఇస్తున్నట్లు ప్రకటించడం అదృష్టంగా భావిస్తున్నాం. రిజర్వాయర్ పనులు పూర్తిచేస్తాం. నౌపడ-వెంకటాపురం రహదారికి రూ.48కోట్లు, కాశీబుగ్గ ఫ్లైఓవర్ బ్రిడ్జికి కూడా తొందరలోనే మోక్షం లభిస్తుంది. పనులు చేయడానికి అధికారులు రంగం సిద్ధం చేశారు. అభివృద్ధి అంటే ఏమిటో మేము చూపిస్తాం.

-గౌతు శిరీష, పలాస ఎమ్మెల్యే

ప్రాక్టికల్స్ గట్టెక్కేదెలా?



మెళియాపుట్టి జూనియర్ కళాశాలలో ప్రయోగాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

● జూనియర్ కళాశాలల్లో కానరాని ల్యాబ్‌లు ● కొన్నిచోట్ల ఉన్నా సౌకర్యాలు లేవు
● ప్రయోగాలు చేసేందుకు విద్యార్థులకు ఇబ్బందులు ● తరగతుల నిర్వహణపైనా నిర్లక్ష్యమే..

● మెళియాపుట్టి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఈ ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సర బైపీసీలో 38 మంది, ద్వితీయ బైపీసీలో 30 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఈ విద్యాలయంలో ప్రయోగశాల లేకపోవడంతో విద్యార్థినులు స్థానిక ప్రభుత్వ కళాశాలలోని ల్యాబ్‌కు వెళ్లి ప్రయోగాలు చేస్తున్నారు. ఈ ల్యాబ్‌లో కూడా సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ల్యాబ్ అభివృద్ధికి ఒక్కరూపాయి కూడా మంజూరు చేయలేదు. దీంతో ల్యాబ్‌లో సరైన పరికరాలు, రసాయనాలు లేక విద్యార్థినులు ప్రయోగాలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

మెళియాపుట్టి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రయోగశాలలు (ల్యాబ్‌లు) లేవు. కొన్ని కళాశాలల్లో ఉన్నా వాటిలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేవు. ల్యాబ్‌ల్లో అవసరమైన పరికరాలు, రసాయనాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రయోగాలపై పట్టు సాధించలేక పోతున్నామని ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో వివిధ యాజమాన్యాల పరిధిలోని 93 జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో మొత్తం 8,420 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో 38 ప్రభుత్వ కళాశాలల్లో 5,819 మంది, 25 కేజీబీవీల్లో 711 మంది, 13 ఆదర్శ జూనియర్ కళాశాలల్లో 1,042 మంది, ఎనిమిది హైస్కూల్ ప్లస్-2 పాఠశాలల్లో 197 మంది విద్యార్థులు చదువుతున్నారు. తొమ్మిది గురుకుల కళాశాలల్లో 533 మంది, గిరిజన సంక్షేమ కాలేజీల్లో 90 మంది, వెనుకబడిన సంక్షేమ కళాశాలల్లో 28 మంది వరకు విద్యనభ్యసిస్తున్నారు. అధికంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉన్న ల్యాబ్‌ల్లో మాత్రమే సౌకర్యాలు ఉన్నాయి. మిగతా కాలేజీల్లో లేకపోవడంతో విద్యార్థులు ఇతర కళాశాలలకు వెళ్లి ప్రయోగాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అక్కడ కూడా ఏదో తూతూమంత్రంగా ప్రయోగాలు చేసి వచ్చేస్తుండడంతో వాటిపై పట్టు సాధించలేకపోతున్నారు. దీంతో ఈ నెల 10 నుంచి జరగనున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలలో గట్టెక్కేదెలా? అని ఆందోళన చెందుతున్నారు.



మెళియాపుట్టి కేజీబీవీ

ప్రయోగాలపై నిర్లక్ష్యం..

ప్రయోగాల పీరియడ్‌ది ఏముందిలే, సబ్జెక్టులు చదివితే పాసవ్వచ్చు.. ర్యాంకులు తెచ్చుకోవచ్చు అనే ధోరణిలో చాలా మంది ఇంటర్ విద్యార్థులు ఉంటున్నారు. కేవలం థియరీ చదవడంపైనే దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. అధ్యాపకులు కూడా చివరి నెలలో నామమాత్రంగా కొన్ని ప్రయోగాలను నేర్పించి మమ అనిపిస్తున్నారు. దీంతో ప్రయోగాల లక్ష్యం నీరు గారుతోంది. వాస్తవానికి ఇంటర్ ఫస్టియర్ నుంచే విద్యార్థులకు సైన్స్ పరిశోధనలపై ఆసక్తి కలిగే విధంగా ల్యాబ్‌లకు తీసుకెళ్లి ప్రయోగాలు చేయించాలి. కానీ, కొన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంటర్‌లో ఎంపీసీ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బైపీసీ వారికి ఫిజిక్స్, కెమిస్ట్రీతో పాటు బోటనీ, జువాలజీ ప్రాక్టికల్స్ కూడా ఉంటాయి. ఉదయం సబ్జెక్టులకు సంబంధించిన తరగతులను, మధ్యాహ్నం ప్రాక్టికల్స్ పీరియడ్‌ను నిర్వహించాల్సి ఉంది. కానీ, రెండు పూటలా పాఠాలు బోధించడానికే అధ్యాపకులు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఏటా ప్రయోగాల కోసం అవసరమైన రసాయనాలు, పరికరాల కొనుగోలు కోసం అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేయాల్సి ఉంది. ఒక్కొక్క విద్యార్థికి కెమిస్ట్రీకి సంబంధించి రూ.6, ఫిజిక్స్, బోటనీ, జూవాలజీకి రూ.2 చొప్పున కేటాయించాలి. కానీ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇచ్చిన దాఖలాలు లేవు. దీంతో కొంతమంది అధ్యాపకులే సొంత డబ్బులతో రసాయనాలు, పరికరాలను కొనుగోలు చేసి విద్యార్థులతో ప్రయోగాలు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వాటి కొనుగోలుకు నిధులు అందించేందుకు సిద్ధమవుతోంది.

జాబితా అడిగారు..

ఈ ఏడాది ల్యాబ్‌లకు అవసరమైన పరికరాలు, రసాయనాల కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం జాబితా అడిగింది. రసాయనాల కోసం ఒక్కొక్క విద్యార్థికి సబ్జెక్టుల ఆధారంగా రూ.6, రూ.2 చొప్పున నిధులు వస్తున్నాయి.

-తమిరి వైకుంఠరావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాతపట్నం

ఘనంగా మహాలక్ష్మి కల్యాణం



కల్యాణోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఇలవేల్పు కమ్మసిగడాం మహాలక్ష్మి అమ్మవారి కల్యాణాన్ని శుక్రవారం రాత్రి 9:25 గంటలకు ఘనంగా నిర్వహించారు. నడిపల్లి గ్రామానికి చెందిన సిద్ధాంతి కుటుంబీకులు అమ్మవారికి చీర, మంగళ సూత్రాలు సమర్పించారు. బంటుపల్లి మునసబు కుటుంబీకులు పల్లకిని తెచ్చారు. అనంతరం అమ్మవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణ వేడుకలను తిలకించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. కల్యాణం అనంతరం జాతర ప్రారంభమైంది. జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు. జాతరలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీస్ ఔట్ పోస్టు ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు వి.వి.వి. ప్రసాద్ ఆధ్వర్యంలో సౌకర్యాలు కల్పిస్తున్నారు.



విజయదుర్గకు ప్రత్యేక పూజలు

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలోని నానుబాల వీధిలో వెలసిన విజయ దుర్గమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. దశమి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. అర్చకులు సూర్యనారాయణ శర్మ పూజలు చేశారు.



అసిరితల్లికి ముర్రాటలు చెల్లించుకొనేందుకు బారులుతీరిన మహిళలు



నిద్దాలమ్మ సేవలో...

జి.సిగడాం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నిద్దాం గ్రామదేవత నిద్దాలమ్మ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా గ్రామ శివారులో ఉన్న అసిరితల్లి అమ్మవారికి మహిళలు ముర్రాటలు చెల్లించి... మొక్కులు తీర్చుకున్నారు. అక్కడి నుంచి నాటు బండిమీద నిద్దాలమ్మ ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో లక్ష దీపారాధన చేయనున్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

← నిద్దాలమ్మ ఉత్సవ విగ్రహాల తిరువీధిలో భక్తులు

ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెంచాలి

● ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందిస్తున్న వైద్యంపై ప్రజలకు నమ్మకం కలిగించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 30 పడగల సీహెచ్‌సీలో నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆసుపత్రిలో నెలకొన్న పలు సమస్యలు వైద్యాధికారి ధర్మాన హరిణి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా ఆసుపత్రిలో చిన్న పిల్లల వైద్యులు లేక ఇబ్బంది పడుతున్నామని, జనరేటర్ లేకపోవడంతో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని, ఎక్స్‌రే ప్లాంట్ మంజూరైనా నేటికీ ఏర్పాటు చేయలేదన్నారు. చిన్న పిల్లలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తానని సమావేశానికి హాజరైన సీనియర్ చిన్న పిల్లల వైద్యులు చాపర సుధాకర్ తెలిపారు. వైద్యులు, సిబ్బంది 39 మంది ఉన్నా.. ప్రతిరోజూ ఆసుపత్రికి వచ్చేవారి మాత్రం తక్కువగా ఉంటుందని, సరైన వైద్యం అందించడం ద్వారా ప్రజల్లో నమ్మకం కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే సూచించారు. కాన్పులు ఎక్కువగా జరిగేలా ఆశ కార్యకర్తల ద్వారా అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రస్తుత ఆసుపత్రిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి 20 లక్షల రూపాయలు వరకు ఖర్చు అవుతాయని, ఆసుపత్రిలో రెండు లక్షల మాత్రమే ఉన్నాయని డాక్టర్ హరిణి తెలిపారు. తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే రవికుమార్ ప్రకటించారు. ఈ కార్య క్రమంలో ఎంపిడివో రోణంకి వెంకటరావు, ఆసుప త్రి పాలకవర్గం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

రణస్థలం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బంటుపల్లి పంచాయతీ పరిధిలోని గోశాల, రాధాకృష్ణ మందిరం అంగరంగ వైభవంగా శుక్రవారం ప్రారంభించారు. జగన్నాథ, సుభద్ర, బలభద్ర విగ్రహాలతో పాటు సుదర్శనదేవ్, రాధకృష్ణ, చైతన్య మహాప్రభు, నిత్యానందప్రభు, అష్టభుజ నరసింహస్వామి విగ్రహాలను శ్రీకృష్ణ చైతన్య మిషన్ వర్తమాన అధ్యక్షుడు కేశవ గోస్వామి మహరాజ్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. దేశ నలుమూలల నుంచి సాధువులు, వేలాది మంది భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజల్లో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు దంపతులు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు దంపతులు పాల్గొన్నారు. 51 మంది రిత్వికులతో యజ్ఞ యాగాలు చేయించారు.


పూజల్లో పాల్గొన్న భక్తులు

యువత చేతిలోనే దేశ రాజకీయ భవిష్యత్తు

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అరసవల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): దేశ రాజకీయ భవిష్యత్తు యువత చేతిలోనే ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. నగరంలోని అరసవల్లిలో గల ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు రెండో రోజు శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా తొలుత ఏఐవైఎఫ్ అరుణ పతాకాన్ని మాజీ రాష్ట్ర కార్యదర్శి జేవీ సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. గతానికి, నేటికీ దేశ రాజకీయ వ్యవస్థలో మార్పు కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని, మతోన్మాద శక్తులు దేశాన్ని అశాంతి నిలయం మార్చేస్తున్నాయని ఆరోపించారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గిడిచినా ధనికులు, పేదల మధ్య నేటికీ అంతరం తగ్గలేదన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో చైతన్యవంతమైన యువత మరో స్వాతంత్ర్య సమరానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. డబ్బున్న వారే నాయకులు, మంత్రులుగా చెలామణి అవుతున్నారని, ప్రభుత్వాలు కార్పొరేట్లకు రూ.లక్షల కోట్లలో రుణమాఫీలు చేసి, సామాన్యుల నుంచి మాత్రం ముక్కుపిండి వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ వ్యవస్థను మార్చే శక్తి యువతకు మాత్రమే ఉందన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన నాయకులు కూటమి ప్రభుత్వం పేరుతో బీజేపీ అజెండాను అమలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రం నుంచి 25 మంది ఎంపీలు ఉన్నా.. రాష్ట్ర విభజన హామీలు అమలు చేయించుకోలేని పరిస్థితుల్లో ఉన్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా యువత చైతన్యం పొంది ఐక్య పోరాటాలతో ప్రభుత్వాన్ని నిలదీయాలని, ఈ రాజకీయ వ్యవస్థను మార్చగలిగే శక్తి యువతకే ఉందన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

మతతత్వ శక్తుల నుంచి దేశాన్ని రక్షించుకోవాలి

● సీనియర్ పాత్రికేయులు, సంపాదకులు శ్రీనివాస్

దేశాన్ని కార్పొరేట్, మతతత్వ శక్తులు పరిపాలిస్తున్నాయని, వాటి నుంచి రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సీనియర్ పాత్రికేయులు, సంపాదకులు కె.శ్రీనివాస్ అన్నారు. ఈ సభలో ఆయన ప్రారంభోపన్యాసం చేస్తూ ప్రశ్నించేవారితోనే సమాజ పురోగతి సాధ్యపడుతుందన్నారు. ప్రస్తుతం దేశంలో ప్రశ్నించే ప్రజలను, మీడియా గొంతునూ ప్రభుత్వం నొక్కేస్తుందన్నారు. జాతీయ మీడియా రెండు శక్తుల మధ్య నలిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మతోన్మాద ధోరణి ప్రబలడంతో దేశంలో గత పదేళ్లలో అసహనం, అశాంతి పెరిగిపోయిందన్నారు. మతం మీద, కార్పొరేట్లపై ఉన్న శ్రద్ధ నాణ్యమైన విద్య, వైద్యాన్ని ప్రభుత్వాలు ఎందుకు అందించలేకపోతున్నాయని ప్రశ్నించారు. యువత డ్రగ్స్, బెట్టింగ్, ఆన్‌లైన్ మోసాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు, పోర్టును కాపాడుకోవాల్సిన అవసరం వస్తుందన్నారు. యువత పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. రాజకీయంతో పాటు అన్ని రంగాల్లో యువత రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, నాయకులు సీహెచ్ గీత, పి.సంతోష్‌కుమార్, రిటైర్డు వీసీ హనుమంతు లజపతిరాయ్, రాష్ట్ర నాయకులు యు.కారుమంచి, ఎంవీ సుబ్బారావు, షేక్ సుభానీ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.వలరాజు, జాతీయ కార్యవర్గ సభ్యుడు జాన్సన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాస్

ఖాజీపేట కొట్లాట కేసులో హెచ్‌సీ, కానిస్టేబుల్ సస్పెన్షన్

పొందూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కింతలి పంచాయతీ ఖాజీపేట గ్రామంలో జరిగిన కొట్లాట కేసులో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెచ్‌సీ, కానిస్టేబుల్‌ను ఎస్పీ మహేశ్వరరెడ్డి సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మూడురోజుల కిందట ఖాజీపేటలో రెండు వర్గాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ ఘటనపై ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. ఆ గ్రామానికి దత్తతగా ఉన్న హెచ్‌సీ, కానిస్టేబుళ్ల నిర్లక్ష్యం వల్లే ఈ కొట్లాట జరిగిందని నిర్ధారిస్తూ వారిని ఎస్పీ సస్పెండ్ చేసినట్టు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

ఎక్స్‌కవేటర్ దగ్ధం


కాలిపోతున్న యంత్రం

జి.సిగడాం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బాతువ గ్రామానికి చెందిన కలిగి డిల్లీశ్వరరావుకు చెందిన ఎక్స్‌కవేటర్ (కేట్) శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైంది. తన పొలంలో పనులు చేస్తున్న సమయంలో విద్యుత్ సర్క్యూట్‌తో ఒక్కసాగిగా పొగలు వచ్చి మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి డిల్లీశ్వరరావు సమాచారం అందించాడు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న రాజాం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. అప్పటికే ఈ యంత్రం కాలిపోయింది. సుమారు రూ.50 లక్షలు ఆస్తి నష్టం ఉంటుందని డిల్లీశ్వరరావు లబోదిబోమన్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు, గ్రామస్థులు కోరుతున్నారు.

11న ఆదిత్యుని హుండీల లెక్కింపు

అరసవల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి హుండీల లెక్కింపు ఈ నెల 11వ తేదీ మంగళవారం ఉదయం 8.00 గంటలకు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో వై.భద్రజీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేవదాయ శాఖ సిబ్బంది, అనువంశిక ధర్మకర్త, పాలకమండలి సభ్యులు, అర్చకులు, భక్తులు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీలను తెరవనున్నట్టు ఈవో వై.భద్రాజీ తెలిపారు.

మానసిక దివ్యాంగులకు 'నల్సా' సేవలు

గుజరాతీపేట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మానసిక దివ్యాంగులకు నల్సా (నేషనల్ లీగల్ సర్వీస్ అథారటీ) ద్వారా చట్టపరమైన సేవలు అందించనున్నట్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. ఈ మేరకు న్యాయ సేవల సభ్యులకు శుక్రవారం స్థానిక జిల్లా కోర్టు భవనంలో గల న్యాయవిజ్ఞాన సదనంలో సెన్సిటైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నల్సా ద్వారా బాలల సంరక్షణ కోసం వివిధ చట్టాల ద్వారా అందిస్తున్న స్నేహపూర్వక సేవలను వివరించారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు, ప్యానెల్ న్యాయవాదులు పాల్గొన్నారు.

రేపు మాస్టర్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి మాస్టర్ బ్యాడ్మింటన్ ఎంపికలను ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్నట్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్, కార్యదర్శి మెట్ట అశోక్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలు నగరంలోని శాంతినగర్ కాలనీలోగల ఇండోర్ స్టేడియంలో జరుగుతాయన్నారు. ఇందులో మెన్, ఉమెన్ కేటగిరీల వారిగా 40, 45, 50, 55, 60, 65, 70 పైబడిన సింగిల్స్ డబుల్స్ విభాగాలతోపాటు మిక్సిడ్ డబుల్స్ విభాగంలో పోటీ ఉంటుందన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ పేర్లను 94402 55255 ఫోన్ నెంబరులో సంప్రదించి, ఈ నెల 8వ తేదీ లోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

రజక సంఘ కార్యవర్గం

సోంపేట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణ రజక సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొజ్జిరి రమేష్, కార్యదర్శిగా రాంశెట్టి రంజిత్‌కుమార్, సభ్యులుగా కొవ్వూరు చిన్నారావు, జగన్నాథపురం మోహనరావు తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మామిడిపల్లి ధర్మారావు, నిమ్మాడ సత్యం తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నేరాలు పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు ప్రజలంతా సహకరించి, ప్రతీ గ్రామ పంచాయతీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ధర్మపురం, తులసిగాం పంచాయతీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని గ్రామపెద్దలకు అవగాహన కల్పించారు. అలాగే సంకల్పంలో భాగంగా శుక్రవారం ఈదుపురం జడ్పీ ఉన్నత పాఠశాల, ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి జూహితా అన్నారు. శుక్రవారం పురుషోత్తపురం అర్బన్‌హెల్త్ సెంటర్‌లో పట్టణ ఆరోగ్య, పారిశుద్ధ్యం, పోషకాహార కమిటీ (యూహెచ్ఎస్ఎన్‌సీ) సమావేశం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్, చాట్ల తిరుపతి, డి.కేశవ, మాధవరావు, వెంకట్ పాల్గొన్నారు.

అవగాహన

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మీసాల చిన్నమనాయుడు అన్నారు. శుక్రవారం 5వ వార్డు కండ్రవీధిలో సమావేశం నిర్వహించి బాల్య వివాహాలపై, సైబర్ నేరాలపై, ఆన్‌లైన్ మోసాలు, మైనర్ డ్రైవింగ్, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని తెలుపుతూ వాటివల్ల కలిగే అనార్థాలపై అవగాహన కల్పించారు.

యాగ మహోత్సవం ప్రారంభం

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పాత శ్రీకాకుళంలో ఉన్న సంతోషి మాత ఆలయంలో మూడు రోజులపాటు జరగనున్న యాగ మహోత్సవం శుక్రవారం ప్రారంభమయ్యాయి. అమ్మవారికి సుప్రభాత సేవ, గోపూజ అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.

పన్ను చెల్లించకుంటే చట్టపరమైన చర్యలు

శ్రీకాకుళం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పన్ను చెల్లించకుండా వ్యాపారం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని శ్రీకాకుళం సర్కిల్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ జి.రాణీమోహన్ అన్నారు. శుక్రవారం సర్కిల్ పరిధిలోని టాక్స్ ప్రాక్టీషనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) చివరి దశలో ఉందని.. సర్కిల్ రెవెన్యూ పెంపుదలకు కృషిచేయాలన్నారు. జీఎస్టీ రెగ్యులర్, కాంపోజిషన్ స్కీముల్లో కొనసాగుతున్నవారు డిసెంబర్ నెల ముగిసిన కాలానికిగాను తమ రిటర్నులను దాఖలు చేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై 18 శాతం వడ్డీ విధించి అపరాధ రుసుం వసూలు చేస్తామని స్పష్టం చేశారు. మార్చి 31లోగా పన్ను బకాయిలు చెల్లించేవారికి వడ్డీని ప్రభుత్వం రద్దు చేసిందని.. ఈ అవకాశాన్ని వ్యాపారులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఏసీ కామరాజు, జీఎస్టీ అధికారులు జి.హైమావతి, ఆర్.వేణుగోపాల్, బీవీటీ రమణారావు, చల్లా శ్రీనివాసరావు, టాక్స్ ప్రాక్టీషనర్లు శ్యామ్‌సుందర్, బీవీ రమణ పట్నాయక్, కె.సూర్యం, శివాజీ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ రాణీమోహన్

క్రికెట్ టోర్నీ విజేత ఒడిశా

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక సురింగి రాజా మైదానంలో జరిగిన మహిళా క్రికెట్ టోర్నీ విజేతగా ఒడిశా జట్టు నిలిచింది. బెస్ట్ ఆఫ్ త్రీగా జరిగిన ఈ టోర్నమెంట్‌లో గురువారం జరిగిన మొదటి మ్యాచ్‌తోపాటు శుక్రవారం జరిగిన రెండో మ్యాచ్‌లోనూ ఒడిశా జట్టు విజయం సాధించి ట్రోఫీని సొంతం చేసుకుంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్రాజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 123పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఒడిశా జట్టు 124 పరుగులు చేసి విజయం సాధించింది. జిల్లా క్రికెట్ సంఘం చీఫ్ మెంటర్ ఇలియాన్ అహమ్మద్ (సీఐ) ట్రోఫీని విజేత జట్టుకు అందజేశారు. కార్యక్రమంలో ఐసీసీ క్రికెట్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు దాసరి రాజు, చీఫ్ కోచ్ సుదర్శన్, సెలెక్టర్ కిరణ్, మేనేజర్ జీపీ నాయుడు, అలీం ఖాన్, బత్తుల వెంకటరమణ, ఐసీసీ కోచ్ డి.గోపి, సూరజ్ గౌడో, సాలిన గణేష్ పాల్గొన్నారు.


ట్రోఫీ అందిస్తున్న నిర్వాహకులు

గిరిజనుల మనోభావాలను ప్రభుత్వానికి తెలియజేస్తా

బూర్జ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బూర్జ, సరుబుజ్జిలి మండలాల పరిధిలో ఏర్పాటు చేయనున్న థర్మల్‌పవర్ ప్లాంట్‌పై గిరిజనుల మనోభావాన్ని ప్రభుత్వానికి తెలియజేస్తానని ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ అన్నారు. శుక్రవారం ఆదివాసీ రాష్ట్ర సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు వాబయోగి ఆధ్వర్యంలో అడ్డరిపేట గిరిజన గ్రామంలో పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పవర్ ప్లాంట్‌ను ఎందుకు వ్యతిరేకిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. గిరిజన సంక్షేమమే ధ్యేయంగా వారి అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తానన్నారు. ఆదివాసీ సంఘ నాయకులు బాకంగి సురేష్‌దొర, సవర లక్ష్మణరావు, సవర సింహాచలం, సవర ధర్మారావు, సవర కృష్ణ, సవర రాంబాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు

వైసీపీ హయాంలో అభివృద్ధి శూన్యం

ఆమదాలవలస, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యమని విజయనగరం జిల్లా కాళింగుల సంఘం అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు పేడాడ జనార్దనరావు అన్నారు. శుక్రవారం శ్రీహరిపురంలోని తన స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస వద్ద థర్మల్ పవర్ ప్రాజెక్టును నెలకొల్పడాన్ని వ్యతిరేకిస్తున్న వైసీపీ నాయకులు అప్పట్లో ఏమి చేశారో చెప్పాలన్నారు. నియోజకవర్గ యువతకు ఉపాధి కల్పించేందుకు ఈ ప్రాజెక్టు చేపట్టడాన్ని ప్రతి ఒక్కరూ స్వాగతించాలన్నారు.

విద్యతోపాటు న్యాయవిజ్ఞానం అవసరం

గుజరాతీపేట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యతోపాటు న్యాయవిజ్ఞానం ప్రతి ఒక్కరికీ ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. ప్రపంచ వెట్టిచాకిరీ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దగల ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగం పిల్లలకు అనేక హక్కులు కల్పించిందని, వీటిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది జి.ఇందిరా ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ వీటీ నాయుడు, ఎంవీజీ శంకర్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న న్యాయాధికారి

మరింత నైపుణ్యంతో బోధించాలి

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో దివ్యాంగులకు మరింత నైపుణ్యంతో బోధించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. భారతీయ పునరావాస మండలి (ఆర్‌సీఐ, న్యూ ఢిల్లీ) సహకారంతో వర్సిటీ స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో కంటిన్యూడ్ రీ హేబిటేషన్ ఎడ్యుకేషన్ (సీఆర్‌ఈ)పై వర్సిటీలో మూడు రోజులపాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. జిల్లా సమగ్ర విద్య కోఆర్డినేటర్ బుడుమూరు గోవిందరావు, రీసోర్స్ పర్సన్ ఎం.అన్నపూర్ణ వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ, ప్రత్యేక విద్యా విభాగం సమన్వయకర్త ఎన్‌వీ స్వామినాయుడు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న ఆకతాయిలు

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నగరంలో ఆకతాయిల ఆగడాలు పెరిగిపోతున్నాయి. కళాశాలలు, పాఠశాల వద్ద ద్విచక్రవాహనాలపై వేగంగా రావడంతోపాటు ట్రిబుల్ రైడింగ్ చేస్తూ రెచ్చిపోతున్నారు. నగరంలోని రామలక్ష్మణ కూడలిలో శుక్రవారం సాయంత్రం ముగ్గురు యువకులు ట్రిబుల్ రైడింగ్ చేస్తూ హల్‌చల్ చేశారు. ఈ జంక్షన్‌కు సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ కళాశాల విడిచిపెట్టిన సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చి ఓ ఇంటర్ విద్యార్థిని వారు తమ వాహనంతో గుద్దేశారు. ఇదేమని స్థానికులు నిలదీస్తే వారిని కూడా బెదిరించి అక్కడి నుంచి జారుకున్నారు. అయితే ఈ ప్రాంతంలో నిత్యం ఇటువంటి ఘటనలు రోజూ జరుగుతున్నాయని, పోలీసులు పట్టించుకోవడంతో ఆకతాయలు రెచ్చిపోతున్నారని స్థానికులు వాపోతున్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం)లో కంప్యూటర్ ఇంజనీరింగ్ డిప్లమో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఐతం (టెక్కలి)లో ఈ నెల 2,3,4 తేదీల్లో నిర్వహించిన టెక్నో విజన్-2కె25లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఈవెంట్‌లో శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందరంగా ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ బి.జానకిరామయ్య, అధ్యాపకులు అభినందించారు.

పరిశ్రమల సర్వేకు సహకరించాలి

అరసవల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సర్వేకు ఆయా యాజమన్యాలు సహకరించాలని జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సర్వే కోసం ప్రత్యేక యాప్‌ను రూపొందించడం జరిగిందని, గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగులు ఈ సర్వే నిర్వహిస్తారన్నారు. ఈ సర్వే వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా లభించే వివిధ ప్రోత్సాహకాలు, బ్యాంకుల ద్వారా రుణాలు పొందేందుకు అన్ని పరిశ్రమలకు అర్హత లభిస్తుందన్నారు. ఈ సర్వేకు జిల్లాలో గల అన్ని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల యాజమాన్యాలు సహకరించాలని కోరారు.

నిధుల మంజూరుపై హర్షం

కంచిలి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి అంపురం నుంచి ఎంఎస్ పల్లి మీదుగా ముకుందపురం ఘటీ వరకు 11 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.23కోట్లు ప్రభుత్వం మంజూరు చేయడంపై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు స్థానిక మార్కెట్ యార్డు ప్రాంగణంలో పార్టీ ప్రధాన కార్యదర్శి మాదిన రామారావు ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం సమావేశమయ్యారు. ఈ రోడ్డు పూర్తయితే సుమారు ఎనిమిది పంచాయతీల ప్రజలతో పాటు ఒడిశా వాసులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. చినబాబురెడ్డి, రామారావు కిశోర్ పాడీ ఉన్నారు.

'గ్రిగ్స్' ఓవరాల్ చాంపియన్‌గా ఎంజేపీ

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): స్థానిక కోడి రామ్మూర్తి స్టేడియంలో శుక్రవారం జరిగిన జిల్లాస్థాయి పాఠశాలల క్రీడాలు(గ్రిగ్స్) అథ్లెటిక్స్ విభాగంలో బాలురు, బాలికలు ఓవరాల్ చాంపియన్‌గా మహాత్మా జ్యోతిబా పూలే (ఎంజేపీ) పలాస విద్యార్థులు నిలిచారు. బాలురు స్పోర్ట్స్ చాంపియన్‌గా సీతాపురం జడ్పీ హైస్కూల్, బాలికల స్పోర్ట్స్ చాంపియన్‌గా కుప్పిలి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు నిలిచారు. బాలుర వ్యక్తిగత విభాగంలో చాంపియన్‌గా సీతాపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థి పి.హర్షవర్ధన్, బాలికల వ్యక్తిగత విభాగంలో కుప్పిలి జడ్పీ హైస్కూల్ విద్యార్థిని బి.దుర్గ నిలిచారు. బాలుర ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను ఎంజేపీ (శాస్త్రులపేట) విద్యార్థులు, బాలికల ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను ఎంజేపీ (పలాస) విద్యార్థులు సొంతం చేసుకున్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పీఈటీ, పీడీ అసోసియేషన్ అధ్యక్షులు ఎంవీ రమణ, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బీవీ రమణ, జిల్లా పాఠశాలల క్రీడల సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

బాలలను పనుల్లో పెడితే చర్యలు

సోంపేట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని మండల న్యాయసేవా సంఘం అధ్యక్షుడు, 6వ అదనపు జిల్లా న్యాయాధికారి కె.కిశోర్‌బాబు తెలిపారు. కనకదుర్గా తాపీమేస్త్రి సంఘ భవనంలో తాపీమేస్త్రిలతో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. బాలలతో ఎవరైనా పనులు చేయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో కార్మికశాఖాధికారి ఎం.విజయ్ కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

సింహాద్రినాయుడికి నంది పురస్కారం

జి.సిగడాం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మెట్టవలస గ్రామానికి చెందిన బుర్రకథ కళాకారుడు పైల సింహాద్రినాయుడుకి తెలుగు వెలుగు నంది పురస్కారం లభించింది. ఇటీవల విజయవాడలో గల తుమ్మలపల్లి కళాక్షేత్ర వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందుకున్నారు. సుమారు 3800 వరకు ప్రదర్శణలు ఇచ్చారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

గార, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మం పంచాయతీ మెండపేట గ్రామంలో షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఉదయం వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్తలు చీడి రామారావు, రాజేశ్వరి దంపతులు బాబాకి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. స్వామి వారికి అన్న ప్రసాద వితరణ చేశారు. అలాగే బూరవెల్లి గ్రామంలో దశాబ్దాలు చరిత్ర గల ప్రసిద్ధ వాసుదేవమ్మ పేరంటాలు వార్షికోత్సవం శుక్రవారం ఉదయం ఘనంగా నిర్వహించారు.

క్రైం కార్నర్

72 మద్యం బాటిళ్ల స్వాధీనం

జలుమూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్న అంధవరం గ్రామానికి చెందిన గుడ్ల వెంకటరమణను సురవరం కూడలి వద్ద గురువారం రాత్రి పట్టుకున్నట్లు స్పెషల్ ఫోర్సు పోలీసులు పట్టుకున్నట్లు ఎస్ఐ అశోక్ బాబు తెలిపారు. అతని వద్ద నుంచి 72 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి కోటబొమ్మాళి కోర్టులో హాజరుపరిచామన్నారు.

తమ్ముడి మృతదేహానికి అక్క అంత్యక్రియలు


దహన సంస్కారాలు చేస్తున్న సోదరి

నందిగాం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తమ్ముడి మృతదేహానికి అక్క అంత్యక్రియలు నిర్వహించిన ఘటన శుక్రవారం హరిదాసుపురంలో జరిగింది. గ్రామానికి చెందిన కణితి సుధాకర్ (32) అనారోగ్యంతో మృతిచెందాడు. తండ్రి మూడేళ్ల కిందటే మృతి చెందగా, తల్లి కంటి చూపు సమస్యతో బాధపడుతోంది. భార్య విడాకులు తీసుకుని వెళ్లిపోవడంతో సోదరి కృష్ణవేణి తమ్ముడికి దహన సంస్కారాలు చేసి చితికి నిప్పటించింది.

బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు

జలుమూరు (సారవకోట) ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బొంతు కూడలిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో చవితి సీది గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్‌కు కాలు విరిగిపోగా మహసింగి గ్రామానికి చెందిన ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం తెలిసిన 108 సిబ్బంది క్షతగాత్రులను నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

రాత్రీపగలూ.. ఇసుక అక్రమ రవాణా


నది నుంచి ఇసుకను తరలిస్తున్న దృశ్యం

కొత్తూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నివగాం ఇసుక ర్యాంప్ నుంచి పగలు, రాత్రీ తేడా లేకుండా నదీ గర్భాన్ని తోడేస్తూ ఇసుకను తరలించేస్తున్నారు. మనుషులతో ఇసుక తవ్వి ట్రాక్టర్లకు నింపి డంపింగ్ యార్డుకు చేర్చి అక్కడి నుంచి తరలించాలనే నిబంధన ఉన్నప్పటికీ వాటిని కాదని నదిలో రెండు భారీ ఎక్స్‌కవేటర్లతో ఇసుకను తవ్వి అక్రమంగా తరలిస్తున్నారు. భారీ ఎత్తున ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా అధికార పార్టీ నేతల ఒత్తిడితో మైన్స్, రెవెన్యూ అధికారులు అటువైపు వెళ్లేందుకు భయప డుతు న్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇసుకాసురులు రోజుకు 10 నుంచి 15 వేల టన్నుల ఇసుక తవ్వకం చేస్తూ లక్షలాది రూపాయలను దోచుకుంటున్నారని ఆరోపణలొస్తున్నాయి. ఈ అక్రమ తవ్వకాల వల్ల నివగాం-మాతల బ్రిడ్జికి ప్రమాదం పొంచి ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

గురుకులాలకు నూతన భవనాలు నిర్మించండి

కాశీబుగ్గ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పలాస నియోజకవర్గంలోని బైపల్లి, పలాసలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలకు నూతన భవనాలు నిర్మించాలని పలాస నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి, రజక సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ డా.దుర్గారావు కోరారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితమ్మను విజయవాడలో కలిసి వినతిపత్రం అందించారు. బైపల్లిలో మత్స్యకార గురుకులాన్ని 40 ఏళ్ల కిందట నిర్మించారని, ఇది కూలేందుకు సిద్ధంగా ఉందన్నారు. అలాగే పలాసలో సొంత భవనం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఆర్‌హెచ్‌పురం పంచాయతీలో విజిలెన్స్ విచారణ


రోడ్డు కొలతలు తీస్తున్న అధికారులు

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రుంకుహను మంతపురం గ్రామ పంచాయతీలో గతంలో జరిగిన అభివృద్ధి పనులపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంలో అక్రమాలు జరిగాయని వచ్చిన ఫిర్యా దుల మేరకు జిల్లా విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు విచారణకు ఆదేశిం చారు. ఈ మేరకు విజిలెన్స్ సీఐ సింహాచలం, ఏఈ ప్రేంకుమార్, అసిస్టెం ట్ రిజిస్ట్రార్ ఎర్రన్నాయుడు, హెచ్‌సీ కామేశ్వరరావు రోడ్లు, కాలువల నిర్మా ణాలు, తాగునీటి అవసరాల పనులను తనిఖీ చేశారు. ప్రతి పనికి సంబం ధించి కొలతలు తీసుకున్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా రమేష్‌నాయుడు



హరిపురం, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జి ఎంపీడీవోగా రమేష్‌నాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వజ్రపు కొత్తూరులో విధులు నిర్వహిస్తున్న ఈయనను మందసలో అదనపు బాధ్యతలతో ఇన్‌చార్జిగా నియమించారు.

సాగునీటి పథకాల వివరాలివ్వండి

ఎల్.ఎన్.పేట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతుల పంట పొలాలకు సంబంధించిన చిన్నతరహా సాగునీటి పథకాల వివరాల నివేదికలను వెంటనే తహసీల్దార్ కార్యాలయానికి అందించాలని అసిస్టెంట్ స్టాటస్టికల్ అధికారి (ఏఎస్‌వో) పి.అప్పలనాయుడు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ కార్యదర్శులతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొలాలకు ఆయకట్టు చెరువుల నుంచి నీరు సరఫరా అవుతున్నదీ లేనిదీ క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు తయారు చేయాల న్నారు. ఇంతవరకు రైతుల పంటపొలాల్లో ఉన్న బోర్లు, బావుల ద్వారా పంటలకు నీరు సరఫరా జరిగితే వాటిని గుర్తించి నివేదికలో పొందుపరచాలన్నారు. నివేదికల తయారీలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఆర్ఐ ఎస్.గవరయ్య, రెన్యూ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీలో విద్యార్థినుల ప్రతిభ

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఎం.సున్నాపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థినులు జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచారు. గురువారం శ్రీకాకుళంలో జరిగిన గ్రిక్స్‌లో ఖోఖో పోటీలో రన్నరప్‌గా నిలిచారు. వీరిని హెచ్ఎం కొమ్ము సుజాత, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

దుర్గంధం

- అటుగా వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే..
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న బాటసారులు
- ఇదీ హరిపురం కూడలిలో దుస్థితి


రోడ్డు పక్కనే వేసిన చెత్త

హరిపురం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మందస మండలం హరిపురం-బాలిగాం కూడలి దుర్గంధభరితంగా తయారైంది. దుకాణాల నుంచి చెత్తా చెదారాలతో పాటు చికెన్ వ్యాపారులు కోడి వ్యర్థాలు రోడ్డు పక్కన పడేస్తుండ డంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. దీంతో అటుగా వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. హరి పురం,


కూడలి వద్ద చెత్తతో నిండిన కాలువ

బాలిగాం పంచాయతీలకు వేర్వేరుగా చెత్త సంపద కేంద్రాలున్నా చెత్తను అక్కడికి తరలించడం లేదు. పంచా యతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా చెత్తను రోడ్డు పక్క పడేస్తుండడంతో ఈ పరిస్థితి నెలకొంది. పైగా పందులు, కుక్కలతో ఈ పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. పైగా పందులు, కుక్కలు బాటసారులపై దాడి చేసి గాయపరుస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుకాణాలన్నీ హరిపురం పంచాయతీ పరిధిలో ఉండగా వ్యర్థాలు బాలిగాం పంచాయతీ పరిధిలో వేస్తున్నారు. సమీపంలోని చెరువు పరిస్థితి ఇలా గే ఉంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించాలి

- ఎమ్మెల్యే శిరీషకు విన్నవించిన జీడిరైతు సంఘ నాయకులు


ఎమ్మెల్యే శిరీషతో మాట్లాడుతున్న జీడి రైతుసంఘ నాయకులు

పలాస, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జీడి పిక్కలకు మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకో వాలని జీడి రైతు సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గౌతు శిరీషను కలిసి వినతి పత్రం అందిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 80 కిలోల జీడి పిక్కల బస్తా రూ.16 వేలు కనీస మద్దతు ధర ప్రక టించేలా కృషి చేయాలన్నారు. సంఘ కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. జీడి సాగు వ్యయం పెరగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, 2018లో రూ.15 వేలు పలికిన ధర ప్రస్తుతం రూ.8 వేలకు పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభు త్వమే నేరుగా జీడి పిక్కలను కొనుగోలు చేసి వ్యాపారులకు అంది స్తే రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. పలాసలో జీడి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని, నాణ్యమైన జీడి మొక్కలు ఉచితం గా అందించాలని, జీడితోటల అభివృద్ధికి మూడేళ్లకు రూ.94 వేలు చొప్పున రైతులకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మోహనరావు, నాయకులు ఎన్.గణపతి, కోనేరు ఆది నారాయణరావు, జి.బాలకృష్ణ, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ కుర్చీల పంపిణీ


స్టడీ కుర్చీలు అందిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మెట్టూరు జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్ కోసం కుర్చీలు, ప్లాంకులను శుక్రవారం హెచ్ఎం డి.లక్ష్మీనరసిం హం, మెట్టూరు సర్పంచ్ మొజ్జాడ రుక్మిణి, విద్యా కమిటీ చైర్మన్ జామి భానుమూర్తి, ఉప చైర్మన్ జి.లక్ష్మి పంపిణీ చేశారు. 129 మంది విద్యార్థుల కోసం దాతల నుంచి సేకరించిన విరాళాలతో వీటిని కొనుగోలు చేశామన్నారు. రానున్న నెలరోజులు శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారులకు విద్యా సామగ్రి..

హిరమండలం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పిండ్రువాడ ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు స్థానిక అంబేడ్కర్ యువజన సంఘం నాయకుల నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, రైటింగ్ ప్యాడ్స్, జామెట్రీ బాక్సులను శుక్రవారం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసేందుకు ఈ సాయం అందించామన్నారు.

డ్రైవింగ్‌లో అప్రమత్తంగా ఉండాలి

హరిపురం, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్ సమయాల్లో యువత అప్రమత్తంగా ఉండాలని సీఐ తిరుపతిరావు అన్నారు. హరిపురం-బాలిగాం కూడలిలో శుక్రవారం 'సంకల్పం'లో భాగంగా విద్యార్థులు, మహిళలకు వివిధ అంశాలపై అవగాహన కలిగించారు. విద్యార్థులకు ఇంటర్, డిగ్రీ దశలు చాలా కీలకమని, వీటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కార్య క్రమంలో ఎస్ఐ కె.కృష్ణప్రసాద్, పోలీస్ సిబ్బంది శేఖర్, నీలకంఠం, ఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మందస తహసీల్దార్‌పై విచారణ?

హరిపురం, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): మ్యుటేషన్‌కు సంబంధించి డబ్బులు డిమాండ్ చేసినట్లు రైతుల ఫిర్యాదు మేరకు మందస తహసీల్దార్ షైమావతిపై జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీవో వెంకటేష్ విచారణ చేపట్టినట్లు సమాచారం. బాలిగాం గ్రామానికి చెందిన శమళ్ల తిరుమలరావు, కృష్ణప్రసాద్ వారసత్వంగా వచ్చిన భూమిని తమ పేరుపై మ్యుటేషన్ చేయించుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారు. దీని నిమిత్తం ఆమె డబ్బులు డిమాండ్ చేయడంతో బాధితులు సీఎంవో కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. సీఎంవో అధికారుల ఆదేశాల మేరకు జిల్లా అధికారులు విచారణ చేపట్టినట్లు విశ్వసనీయ సమాచారం. ఈమె గతంలో కంచిలిలో పని చేసినప్పుడు కూడా పలు ఆరోపణలు ఎదుర్కొన్నట్లు అక్కడి ఎమ్మెల్యే సైతం ఫిర్యాదులో పేర్కొన్నట్లు భోగట్టా. జేసీ నివేదిక మేరకు తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా ఈ ఫిర్యాదు అందిందని, విచారణ చేపట్టి సంబంధిత అధికారికి హెచ్చరించామన్నారు. పూర్తిస్థాయి నివేదిక మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంటింటికీ వెళ్లి విభిన్న ప్రతిభావంతులను గుర్తించాలి


డీఈఐసీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి

టెక్కలి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి విభిన్న ప్రతిభా వంతులను గుర్తించాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జిల్లా కేంద్ర ఆసుపత్రిలోని జిల్లా ప్రారంభ జోక్య కేంద్రం (డీఈఐసీ)ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతులైన పిల్లలకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీశారు. వీరికి ఎటువంటి వైద్య సదుపాయాలు అవసరమో గుర్తించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మేరీకేథరిన్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సూర్యారావు, ఆర్ఎంవో డాక్టర్ మహరాజ్, డీఈఐసీ అధికారి డాక్టర్ రాజశేఖర్, మేనేజర్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరి చేయించిన వారిపై కఠిన చర్యలు


మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రసన్నలత

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వెట్టిచాకిరి చేయించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జూనియర్ సివిల్ న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్నలత అన్నారు. శుక్రవారం వెట్టిచాకిరి నిర్మూలన దినం సందర్భంగా స్థానిక సత్యనారాయణ నగర్‌లో మండల న్యాయసేవాసంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన పెంచుకొని ఇలాంటి వాటిని నిర్మూలించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు లఖినేని శ్రీనివాసరావు, పల్లి వాసుదేవరావు, ధర్మారావు, అప్పల నాయుడు, జీవన్, ఆశోక్ తదితరులు ఉన్నారు.

ఇంటింటి సర్వే పరిశీలన


పోలాకి: సర్వేని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో శ్రీధర్ రాజు

పోలాకి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలో సచివాలయ సిబ్బంది ఇంటింటా చేపడుతున్న ఎలక్ట్రిక్ మీటర్స్, దుకాణాలు, సిటిజన్ హౌస్‌హోల్డ్ సర్వేని శుక్రవారం జడ్పీ సీఈవో శ్రీధర్ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. త్వరితగతిన సర్వే పూర్తి చేసి నివేదిక పంపాలన్నారు. అనంతరం మండల పరిషత్, సచివాలయ సిబ్బందితో మండల అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఆయన వెంట ఎంపీడీవో గరిమెళ్ల రవికుమార్, సూపరింటెండెంట్ బలగప్రకాష్, ఈవోపీఆర్డీ బి.పద్మావతి తదితరులున్నారు.

పాతపట్నంలో..

పాతపట్నం ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి):మేజర్‌పంచాయతీ పాతపట్నంలో దుకాణాలను ఎంఎస్ఎంఈ సర్వేలో భాగంగా అధికారులు పరిశీలించారు. దుకాణాల విద్యుత్ కనెక్షన్లు కేటగిరీలను పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎల్.వెంకటరావు, పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ప్రతి విద్యార్థి పారిశ్రామికవేత్తగా ఎదగాలి

పాతపట్నం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి పారిశ్రామికవేత్తగా ఎదగాలని వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి ప్రోగ్రాం జిల్లా మేనేజర్ అమనాన అనూష అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించి ఈఎండీపీ ప్రోగ్రాం అమలును పరిశీలించారు. విద్యార్థులు సొంత ఆలోచనలతో కొత్త ఆవిష్కరణలను రూపొందించి వ్యాపారాలు చేయాలని సూచించారు. విద్యార్థులు తయారుచేసిన కళాకృతులను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం బి.సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోడ్‌తో అప్పయ్యదొర జయంతి రద్దు

పలాస, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ దివంగత నేత హనుమంతు అప్పయ్యదొర 90వ జయంతిని జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని ఇదివరకు ప్రకటించామని, అయితే ఎన్నికల కోడ్ కారణంగా ఈ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు నిర్వాహకుడు హనుమంతు రామ్మోహన్‌దొర ఒక ప్రకటనలో తెలిపారు. పలాస కేటీ రోడ్డు, జెండి ఫ్లైఓవర్ వద్ద కార్య క్రమాలను నిర్వహించేందుకు అభిమానులెవరూ రావొద్దన్నారు. దొర నివాసం, ఆయన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నామమాత్రంగా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వాతావరణ మార్పులతో రైతుల పాట్లు

నందిగాం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులు చోటుచేసుకొని చినుకులు రాలడంతో రైతుల్లో హడావుడి కనిపించింది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఆకాశంలో మేఘాలు కమ్ముకొని పలుచోట్ల చినుకులు రాలడంతో రైతులు అపరాల పంటలను కాపాడుకునేందుకు ప్రయాస పడ్డారు. పొలాల్లో తీసిన పెసర, మినుము ఓవుల్ని కుప్పలు పెట్టడంతో పాటు కల్లాల్లో విడదీసిన పంటలను కుప్పలు పెట్టి వాటిపై టార్పాలిన్లు కప్పేందుకు ఇబ్బందులు పడ్డారు. సింగుపురం, కాపు తెంబూరు, హర్షబాడ, మలియాలింగుపురం, సవర లింగుపురం, సవర రామ కృష్ణాపురం తదితర గ్రామాల్లో చినుకులు పడడంతో రైతుల్లో ఆందోళన కలిగించింది.

అంధవరం ఇసుక ర్యాంపు వద్ద సీసీ కెమెరాలు

జలుమూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అంధవరం వద్ద వంశధార నదిలో నూతనంగా మంజూరు చేసిన ఇసుక ర్యాంపు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు జె.రామారావు తెలిపారు. ఈ ర్యాంపు నుంచి ఇసుక అక్రమంగా తరలిపోకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా వీటిని ఏర్పాటు చేశామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నది నుంచి ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ర్యాంపును త్వరలో జిల్లా అధికారులు ప్రారంభిస్తారన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో

టెక్కలి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్‌పంచాయతీలో పారిశుధ్య పనులను శుక్రవారం ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి పరిశీలించారు. రోటరీనగర్, వెంకటేశ్వర కాలనీ, శ్రీనివాస్‌నగర్ ప్రాంతాల్లో పర్యటించి కాలువల్లోని చెత్తను గుర్తించి తక్షణం తొలగించాలని పంచాయతీ కార్యదర్శి జగన్నాథరావుకు ఆదేశించారు. స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని, ప్రతిరోజూ తాను పరిశీలిస్తానని ఆయన అన్నారు.

బీటీ రోడ్డు మంజూరు చేయండి

పలాసరూరల్,ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): బొడ్డపాడు నుంచి మందనగడూరు వరకు వయా పెద్దకొండ మీదుగా బీటీ రోడ్డును మంజూరు చేయాలని బొడ్డపాడు, గడూరు ప్రజలు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే గౌతు శిరీషను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ రోడ్డు నిర్మాణం చేపడితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దీనికి ఎమ్మెల్యే శిరీష సాను కూలంగా స్పందించారు. వినతిపత్రం అంద జేసిన వారిలో తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావుతో పాటు బొడ్డపాడు, గడూరు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కొత్త కమిటీల్లో ఎమ్మెల్సీ అనుచరులకు ఝలక్

టెక్కలి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వైసీపీ టెక్కలి నియోజకవర్గ మండల కమిటీ నియా మకాల్లో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అనుచరులకు ఝలక్ ఇచ్చారు. ప్రస్తుత వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ తిలక్ కొత్త కమిటీలను ఏర్పాటు చేశారు. వీటిలో దువ్వాడ అనుచరులుగా ఉన్న టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల పార్టీ కన్వీనర్ల ను తొలగించి కొత్త వారిని నియమించారు. టెక్కలి మండల పార్టీ కన్వీనర్‌గా ఉన్న కిల్లి అజయ్‌ను తొలగించి హనుమంతు వెంకటేశ్వరరావును నియమించారు. సంతబొమ్మాళి కన్వీనర్‌గా ఉన్న కోత సతీష్ స్థానంలో బుడ్డా మోహన రెడ్డిని, కోటబొమ్మాళి కన్వీనర్‌గా ఉన్న నూక సత్యారాజు స్థానంలో సంపతిరావు హేమ రాజును నియమించారు. దీంతో కొత్త వ్యక్తులకు ప్రాధాన్యం ఇచ్చినట్లయింది.

నేటినుంచి లక్ష్మీ నృసింహస్వామి కల్యాణోత్సవాలు

జలుమూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): చిన్నదూగాం కూడలిలోని శ్రీలక్ష్మీ నృసింహస్వామి 63వ కల్యాణ మహోత్సవాలు శనివారం నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రాధాకృష్ణ తెలిపారు. సోమవారం రాత్రి స్వామివారి కల్యాణ నిర్వహిస్తున్నామన్నారు. ఈ 5 రోజుల పాటు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు సాయంత్రం 4 గంటల నుంచి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు చివరి రోజు బహుమతులు అందిస్తా మన్నారు. 11న ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేపడుతున్నామన్నారు. భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని తరించాలని కోరారు.

పోలాకిలో జాతర..

పోలాకి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పోలాకి మండల కేంద్రంలో వెలసిన కనకదుర్గా భవానీ 23వ జాతర శనివారం నుంచి 12వ తేదీ వరకు జరుగుతుందని ఆలయ ధర్మకర్తలు టంకాల శ్రీరాములు, పల్లి రాజుభవానీ తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతిరోజు వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక హారతులు, హోమాలు, అభిషేకాలు నిర్వహిస్తారన్నారు. శనివారం సాయంత్రం అమ్మవారి రథయాత్రతో జాతర ప్రారంభమవుతుందన్నారు. ఈ జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఐదురోజుల పాటు రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

గోపాలపెంటలో నేడు..

నరసన్నపేట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గోపాలపెంట గ్రామంలో భీష్మఏకాదశి సందర్భంగా రాములమ్మ జాతర శనివారం నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకుడు యాళ్ల వేణుగోపాలరావు తెలిపారు. రాములమ్మ పేరంటాలుకు ముర్రాటలు చెల్లించి అరటి గెలలు, చీరలతో మొక్కులు చెల్లించుకోవడం అనాదిగా వస్తోంది. అలాగే అన్నదానం కూడా చేపట్టనున్నామన్నారు. గోపాలపెంట సమీపంలో వంశధార నదిలో భక్తులు పుణ్యస్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకుంటారు.

షిర్డీసాయి మందిర వార్షికోత్సవం..

పాతపట్నం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కొరసవాడ గ్రామంలోని షిర్డీసాయినాథ మందిర 20వ వార్షికోత్సవం శనివారం నుంచి సోమవారం వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శతాధిక కలశాభిషేకాలు, వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మందిరాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు

టెక్కలి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నర్సింగపల్లిలో శ్రీ కోదండరామ ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సామూహిక కుంకుమపూజలు నిర్వహించారు. అర్చకులు శతపతి ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో పురోహితులు రుద్రాభిషేకం, ధాన్యాధివాసం, హోమాది కార్యక్రమాలు, వేద పారాయణం చేస్తారు. సామూహిక కుంకుమ పూజల్లో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. శనివారం స్వామి విగ్రహ ప్రతిష్ఠ చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పోలాకి షణ్ముఖరావు, రౌతు జయ మోహన్, రట్టి మణి, తిరుపతిరావు, ఆదినారాయణ, బైరాగి, శంకర్, లచ్చుమయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవాలు ప్రారంభం

నందిగాం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సుబ్బమ్మపేటలో కొలువై ఉన్న లక్ష్మీనరసిం హస్వామి కల్యాణోత్సవాలు శుక్ర వారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కె.రంగనాథన్ ఆధ్వర్యంలో ప్రముఖ వేదపండితులు చామర్తి శ్రీనివాసాచార్యులు, ఆలయ అర్చకుడు కె.రామానుజాచార్యులు, రుత్వికుల ఆధ్వర్యంలో విశేష పూజలు చేపట్టారు. భీష్మ ఏకాదశి సందర్భంగా శనివారం స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలి పారు. భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

హరిపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): డిమిరియా గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలు, అభి షేకాలు చేపట్టారు. గ్రామంలో స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరిగేంచారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. స్వామిని ఎమ్మెల్యే గౌతు శిరీష దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బావన దుర్యోధన, రట్టి లింగరాజు, గ్రామస్థులు ముంజేటి చంద్రశేఖర్, పల్లి చంద్రయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


టెక్కలి: నర్సింగపల్లిలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు